సాక్షి
చిత్తూరు
గురువారం । 10 । అక్టోబర్ । 2024



వెలుగులో కూటమి విషం
వెలుగు సిబ్బందిపై కూటమి నేతలు విషం కక్కుతూ వారిని తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారు. - 10లో



చెరుకు కనుమరుగు
చక్కెర ఫ్యాక్టరీలు బకాయిలు చెల్లించక పోవడంతో తీవ్రంగా నష్టపోయిన రైతులు చెరుకు సాగు జోలికెళ్లడం లేదు. - 10లో



ఫ్రీ హోల్డ్ భూములపై నివేదిక
జిల్లాలోని ఫ్రీ హోల్డ్ భూములపై నివేదిక ఇవ్వాలంటూ జాయింట్ కలెక్టర్ విద్యాధరి తహసీల్దార్లను ఆదేశించారు. - 10లో

న్యూస్‌రీల్

డీఎఫ్‌ఓ బాధ్యతల స్వీకరణ


భరణి

చిత్తూరు కార్పొరేషన్: డీఎఫ్‌ఓగా భరణి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. కాకినాడ నుంచి ఆమె ఇక్కడికి బదిలీపై వచ్చారు. జిల్లాలోని రేంజర్లు, సిబ్బంది ఆమెను మర్యాదపూర్వకంగా కలిశారు. చిత్తూరు జిల్లాపై కొద్దిపాటి అవగాహన ఉందన్నారు. జిల్లా అంతటా పర్యటించి క్షేత్రస్థాయి పరిస్థితులను తెలుసుకుంటానన్నారు. ఉద్యోగుల సహకారంతో కలిసి పనిచేస్తానని వివరించారు.

14న ఐటీఐలో అప్రెంటిస్ మేళా

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో ఈ నెల 14వ తేదీన అప్రెంటీస్ మేళా నిర్వహించనున్నట్లు ఆ కళాశాల ప్రిన్సిపల్ రవీంద్రారెడ్డి తెలిపారు. ఈ మేరకు బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రధానమంత్రి నేషనల్ అప్రెంటిస్ ఖాళీలను భర్తీ చేసేందుకు ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో ఈ అప్రెంటిస్ మేళా నిర్వహించనున్నట్లు తెలిపారు. 14వ తేదీ ఉదయం నిర్వహించే ఈ మేళాకు ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐ కళాశాలల్లో శిక్షణ పూర్తి చేసి ఉత్తీర్ణత పొందిన విద్యార్థులు సంబంధిత సర్టిఫికెట్లతో హాజరు కావాలన్నారు. ముందస్తుగా ఐబీఎం పోర్టల్‌లో నమోదు చేసుకోవాలని సూచించారు. లేనిపక్షంలో నేరుగా తమ కార్యాలయంలో ఈ నెల 14న నిర్వహించే అప్రెంటీస్ మేళాకు హాజరు కావాలని పేర్కొన్నారు. ఈ మెగా అప్రెంటిస్ మేళాకు జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ కంపెనీలు పాల్గొంటాయని, ఈ సదవకాశాన్ని జిల్లాలోని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. వివరాలకు 90306 57957ను సంప్రదించాలని ప్రిన్సిపల్ కోరారు.

మద్యం దుకాణాలకు 1500 దాటిన దరఖాస్తులు

చిత్తూరు అర్బన్: జిల్లాలో మద్యం దుకాణాల లైసెన్సుల కోసం పోటీపడుతున్న వారి సంఖ్య 1500 దాటింది. జిల్లాలోని 104 ప్రైవేటు మద్యం దుకాణాల నిర్వహణ కోసం అధికారులు టెండర్లు ఆహ్వానించగా, ఇప్పటి వరకు 1570 మంది ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నారు. బుధవారానికి గడువు ముగియాల్సి ఉండగా, దీన్ని ఈనెల 11వ తేదీ వరకు పొడిగిస్తూ ప్రభుత్వం ఆదేశాలిచ్చింది. వచ్చిన దరఖాస్తులను లాటరీ పద్ధతి ద్వారా ఈ నెల 14వ తేదీన డిప్ తీసి దుకాణాలను కేటాయించనున్నారు. డిప్‌లో దుకాణాలు దక్కించుకున్న వాళ్లు ఈనెల 16వ తేదీ నుంచి మద్యం వ్యాపారం చేసుకోవచ్చు. ఇక ఎక్సైజ్ సర్కిల్ వారీగా వచ్చిన దరఖాస్తులు పరిశీలిస్తే, చిత్తూరు అర్బన్‌లో 22 దుకాణాలకు 348, చిత్తూరు రూరల్‌లో 19 దుకాణాలకు 365, కార్వేటినగరంలో 8 దుకాణాలకు 182, నగరిలో 11 దుకాణాలకు 154, పుంగనూరులో 14 దుకాణాలకు 101, పలమనేరు 13 దుకాణాలకు 145, కుప్పంలో 10 దుకాణాలకు 241, పులిచెర్లలో 7 దుకాణాలకు 37 దరఖాస్తులు అందగా, రెండు దుకాణాలకు సింగిల్ టెండర్లే పడ్డాయి. రూ.2 లక్షల నాన్ రీఫండబుల్ రుసుము ద్వారా ఇప్పటివరకు జిల్లా నుంచి ప్రభుత్వానికి కేవలం దరఖాస్తు చేసుకోవడం ద్వారా రూ.15.70 కోట్ల ఆదాయం లభించినట్లు తెలుస్తోంది.

లింగ నిర్ధారణ చేస్తే చర్యలు తప్పవు

సాక్షి ఎఫెక్ట్..

కాణిపాకం: నిబంధనలకు విరుద్ధంగా లింగ నిర్ధారణ చేస్తే స్కానింగ్ సెంటర్లను సీజ్ చేస్తామని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి ప్రభావతిదేవి హెచ్చరించారు. సాక్షి దినపత్రికలో బుధవారం ఆ బిడ్డయితే అంతమే అనే శీర్షికన వార్తా కథనం ప్రచురితమైంది. దీనిపై రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ అధికారులు స్పందించారు. లింగ నిర్ధారణపై ఆగ్రహం వ్యక్తం చేశారు. తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల గర్భిణులు జిల్లాలోని స్కానింగ్ సెంటర్లను ఆశ్రయించడం ఏమిటని ప్రశ్నల వర్షం కురిపించారు. దీనిపై జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు రాష్ట్ర వైద్యారోగ్యశాఖ అధికారులకు వివరణ ఇచ్చుకున్నారు. లింగ నిర్ధారణ కట్టడికి జిల్లా కలెక్టర్ అధ్యక్షతన కమిటీ పనిచేస్తోందన్నారు. సరిహద్దు ప్రాంతాల్లో జరుగుతున్న లింగనిర్ధారణపై నిఘా ఉంచాలని మండల వైద్యాధికారులకు ఆదేశాలు జారీ చేశామన్నారు. డెకాయి ఆపరేషన్‌ను పకడ్బందీగా నిర్వహిస్తున్నామన్నారు. చట్ట విరుద్ధంగా వ్యవహరిస్తే తొలిసారి నోటీసులు ఇస్తామన్నారు. మరోమారు కొనసాగితే స్కానింగ్ సెంటర్‌ను సీజ్ చేస్తామన్నారు. గర్భనిరోధక మందుల వినియోగంపై డ్రగ్ ఇన్‌స్పెక్టర్ సహకారంతో మందుల షాపుపై దాడులు చేపడుతున్నామన్నారు. ఆశా, ఏఎన్‌ఎంలు గర్భస్థ లింగ నిర్ధారణకు సహకరిస్తున్నారని తేలితే కచ్చితంగా వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. ఆర్‌ఎంపీ క్లినిక్‌లు నిబంధనలకు విరుద్ధంగా చికిత్స చేస్తే క్లినిక్‌లను సీజ్ చేస్తామని ఆమె పేర్కొన్నారు.

తేజోమూర్తి.. స్వర్ణకీర్తి


స్వర్ణరథంలో విహరిస్తున్న మలయప్పస్వామి (ఇన్‌సెట్) హనుమంత, గజవాహనాలపై శ్రీవారు

భక్తుడంటే అంజనీ సుతుడిలా ఉండాలి.. దాసభక్తిని చాటుకోవాలి..కనుసైగల్లో మెలగాలి.. ఇవీ హనుమంతుడి సుగుణాలు.. అలాంటి త్రేతాయుగం నాటి విశేషాలు తిరుమల క్షేత్రంలో సాక్షాత్కరించాయి. గజేంద్ర మోక్షం..దివ్యప్రబోధ గీతం.. సరస్సులో దిగిన కరి.. శ్రీహరి ని ప్రార్థిస్తూ ఇక కలవో..లేవో అంటూ నిష్ఠూరమాడిన వేళ ఆ దేవదేవుడు చెలికి చెప్పకుండానే ఇలకు చేరిపోయాడు. భక్తవరేణుడైన గజేంద్రుడిని మొసలి బంధనాల నుంచి విముక్తి కల్పించాడు. శరణుగోరిన వారికి నిత్యరక్షకుడిగా ఉంటానని సందేశమిచ్చాడు. ఆ భాగవత గాథ సాక్షాత్కరిస్తూ శ్రీవారు మాడవీధుల్లో దర్శనమిచ్చారు. వాసుకి, సూర్యచంద్రులు, శ్రితపరిపాలకుడిని మోసి తరించారు. తానేమీ తక్కువ కాదని ఆ వైకుంఠ వాసుడికి స్వర్ణరథమూ సేవలందించింది. ఇదీ శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా తిరుమలలో బుధవారం జరిగిన వైభవోత్సవం.

వైభవోత్సవం
- మూడు వాహనసేవల్లో మురిపించిన ముగ్ధమనోహరుడు
- ఉదయం హనుమంత వాహనం, సాయంత్రం స్వర్ణరథోత్సవం, రాత్రి గజవాహనంపై మలయప్ప

తిరుమల: శ్రీవారి బ్రహ్మోత్సవాలు కనుల పండువలా సాగుతున్నాయి. బుధవారం ఉదయం హనుమంత వాహనం, సాయంత్రం స్వర్ణరథం, రాత్రి గజవాహనంపై స్వామివారు ఊరేగుతూ భక్తకోటిని కటాక్షించారు. దేవదేవుని దివ్యమంగళరూపా న్ని దర్శించుకున్న భక్తులు దివ్యానుభూతిని పొందారు. ఉదయం హనుమంత వాహనంలోనూ భక్తుల సందడి కనిపించింది. సాయం సంధ్యవేళ స్వర్ణ రథోత్స వంలో వేలాది మంది భక్తులు స్వామివారి ని దర్శించుకుని, తన్మయత్వం పొందారు. రాత్రి గజవాహనం కూడా భక్తుల కోలాహలం మధ్య సాగింది. వాహన సేవల్లో కళాకారుల నృత్యాలు, కోలాటాలు, భజ న బృందాల సందడి కనిపించింది. కళాకారుల విభిన్న కళా ప్రదర్శనలు భక్తులను కట్టిపడేస్తున్నాయి. భద్రతా సిబ్బంది హడావుడి ఏమాత్రం తగ్గలేదు. తిరుమలలో పుష్ప, విద్యుత్ దీపాలంకరణలు, టీటీడీ ఉద్యానవన శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఫల, పుష్ప ప్రదర్శనశాలకు భక్తుల తాకిడి ఎక్కువగా కనిపించింది. ఫొటో ఎగ్జిబిషన్‌కు భక్తుల నుంచి విశేష ఆదరణ లభిస్తోంది.

స్వర్ణరథం
శ్రీనివాసుడు ధగధగా మెరిసిపోతున్న స్వర్ణరథాన్ని అధిరోహించి భక్తులను అనుగ్రహిస్తాడు. స్వర్ణరథం శ్రీనివాసునికి అత్యంత ప్రీతిపాత్రమైనది. స్వర్ణమయమైన రథంలో శ్రీభూదేవేరులతో మలయప్ప దర్శనమిస్తాడు.








వాహనసేవలో కళాకారుల నృత్య ప్రదర్శన



టీడీపీ గూండాగిరి

గంగవరంలోని డ్రైవర్స్ కాలనీలో టీడీపీ గూండాగిరి విచ్చలవిడిగా సాగుతోంది. అధికారాన్ని అడ్డుపెట్టుకుని ఆ పార్టీ నేతలు చేస్తున్న అరాచకాలకు అడ్డు లేకుండా పోతోంది. కాలనీలో విధ్వంసం సృష్టించి, స్థానికులను భయాందోళనకు గురి చేస్తున్నారు. తెలుగు తమ్ముళ్ల దాటికి భయపడి కొందరేమో కాలనీ వదిలి వెళ్లిపోయారు. మరి కొందరేమో ఇళ్లను ఖాళీ చేసేందుకు సిద్ధంగా ఉన్నారు. ఇంత అరాచకం జరుగుతున్నా అధికార యంత్రాంగం చోద్యం చూస్తుండడం విమర్శలకు దారితీస్తోంది.


ప్రశ్నించిన వారిపై దాడి చేస్తున్న టీడీపీ నాయకులు

- డ్రైవర్స్ కాలనీలో 'పచ్చ' పైశాచికం
- పేదల ఇంటి స్థలాల దురాక్రమణ
- అడిగిన వారిపై దాడికి తెగబడిన తమ్ముళ్లు
- ఆస్పత్రి పాలైన బాధితులు
- చోద్యం చూస్తున్న అధికారులు


టీడీపీ నాయకులు ఆక్రమించిన పేదల స్థలం

సాక్షి టాస్క్‌ఫోర్స్: పేదల ఇళ్ల స్థలాలపై కన్నేసిన అధికార పార్టీ నాయకులు, అనుకుందే తడవుగా ఆక్రమించేశారు. ఇదేం అన్యాయమంటూ ప్రశ్నించిన వారిపై బుధవారం దాడి చేసి, గాయపరిచారు. బాధితులు, స్థానికుల కథనం మేరకు, డ్రైవర్స్ కాలనీలో అధికార పార్టీకి చెందిన రవి, శివ కూటమి ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి వీరవిహారం చేస్తున్నారు. కాలనీలో ఏళ్ల తరబడి నివాసం ఉంటున్న వారికి గతంలో ప్రభుత్వం స్థలాలను కేటాయించింది. అయితే వారిలో కొందరు సరిపడా డబ్బులు లేక చాలా స్థలాల్లో ఇళ్లు నిర్మించుకోలేదు. అలా దాదాపు 50 మందికి చెందిన ఖాళీ ఇళ్ల స్థలాల్లో హద్దురాళ్లను రాత్రికి రాత్రే టీడీపీ నేతలు పెకళించి ఆక్రమించేశారు. ఈ విషయమై మంగళవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేసి తహసీల్దార్‌కు వినతిపత్రం ఇచ్చినా స్పందించలేదు.

విన్నవించిన వారిపై దాడులు

తమ ఇళ్ల స్థలాలను కాపాడాలంటూ తహసీల్దార్‌కు విన్నవించిన వారిపై టీడీపీ నాయకులు దాడులకు తెగబడ్డారు. అధికార పార్టీ నేతలు ఆక్రమించుకున్న స్థలాల్లో ఇళ్ల నిర్మాణ పనులు మొదలుపెట్టారు. ఇది గమనించిన యజమానులు తమ స్థలాల్లో పనులు చేయడం ఏంటని అడ్డుకున్నారు. మమ్మల్నే అడ్డుకుంటారా అంటూ కాలనీకి చెందిన శివ, అతని కుటుంబసభ్యులు కలిసి బాధితులు సునంద, శాతాజ్, మణి, భారతమ్మపై దాడికి దిగారు. నలుగురినీ పిడిగుద్దులతోపాటు కర్రలు, రాళ్లతో కొట్టి తీవ్రంగా గాయపరిచారు. బాధితులు ఆస్పత్రి పాలయ్యారు. ఆస్పత్రిలో వాళ్ల బాధ, జరిగిన నష్టాన్ని చెప్పుకుంటూ కన్నీటి పర్యంతమయ్యారు. అధికారాన్ని అడ్డుపెట్టుకుని ఇలా రౌడీయిజం చేస్తున్నారంటూ కాలనీ వాసులు వాపోయారు.

70 స్థలాలు ఆక్రమించేశారు



డ్రైవర్ కాలనీలో చాలా అరాచకాలు చేస్తున్నారు. కాలనీలో 70 స్థలాలు టీడీపీ వాళ్లు ఆక్రమించేశారు. మా ఇళ్ల స్థలాలు అడిగినందుకు మాపైనే దౌర్జన్యాలకు పాల్పడ్డారు. టీడీపీకి చెందిన శివ కుటుంబసభ్యులు నన్ను, మా అమ్మ, నా తమ్ముడు, శాతాజ్ అక్కను నలుగురినీ కర్రలతో కొట్టారు. వారి దౌర్జన్యాలను వీడియో తీస్తుండగా సెల్‌ఫోన్లు తీసి పగలగొట్టారు. నష్టం జరిగింది మాకు, మా స్థలం పోయింది. దెబ్బలు తిన్నాం.. గాయపడ్డాం. కానీ అధికారులు వాళ్లకే వత్తాసు పలుకుతున్నారు. మాకెవరు న్యాయం చేస్తారు?

– సునంద, బాధితురాలు, డ్రైవర్స్ కాలనీ

మా స్థలాన్నే ఆక్రమించి నన్నే కొట్టారు..



టీడీపీ నాయకులు రవి, శివ కలిసి మా ఇంటి స్థలాన్ని ఆక్రమించారు. ఆ స్థలంలో పునాదులు వేయడానికి గుంతలు తవ్వుతుండగా నేను వెళ్లి అడిగాను. వెంటనే శివ భార్య, అమ్మ ఇద్దరూ కలిసి తీవ్రంగా కొట్టారు. చెవి తెగిపోయి రెండు కుట్లు పడ్డాయి. నా చేయిపై శివ కర్రతో కొట్టాడు. "మీకు దిక్కున్న చోట చెప్పుకోండి, మొన్నంతా ఏదో పీకాలని తహసీల్దార్ వద్దకు వెళ్లారు కదా ఎవరైనా వచ్చారా." అంటూ కొట్టారు. మేము ఆక్రమించేదే ఎవరొస్తారో చూస్తాం అంటూ బెదిరించారు. ఇక ఊరొదిలి వెళ్లిపోవాల్సిందే!

– శాతాజ్, బాధితురాలు

చితకబాదుతున్నారు



మా డ్రైవర్స్ కాలనీలో రవి, శివ మూడు నెలలుగా ఇష్టానుసారంగా ప్రవర్తిస్తున్నారు. పునాదులను తవ్వేసి స్థలాలను కబ్జా చేస్తున్నారు. అడిగితే దొరికిన వాళ్లను దొరికినట్లు చితక బాదుతున్నారు. మేమందరం తహసీల్దారు ఆఫీసుకు వెళ్లి అర్జీ ఇస్తే వీఆర్‌ఓ వచ్చి ఇంటి పట్టాలు ఉంటే తీసుకురండి అన్నారే కానీ వాళ్లు ఎందుకు ధ్వంసం చేశారని మాత్రం అడగలేదు. ఇక్కడ ఉన్నది ఆ పార్టీ ఎమ్మెల్యేనే కదా. కనీసం ఆయన అయినా మా గోడు విని, మాకు రక్షణ కల్పించాలి. లేకుంటే మేము వేరే రాష్ట్రానికి వెళ్లిపోవాల్సిందే.

–మణి, బాధితుడు, డ్రైవర్స్ కాలనీ

బోయకొండ గంగమ్మకు పట్టువస్త్రాలు

- సంప్రదాయబద్ధంగా సారె సమర్పించిన పెద్దిరెడ్డి దంపతులు


అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పిస్తున్న మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి దంపతులు

చౌడేపల్లి: జిల్లాలోనే పవిత్ర పుణ్యక్షేత్రమైన బోయకొండ గంగమ్మకు మాజీ మంత్రి, ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి దంపతులు పట్టువస్త్రాలు సమర్పించారు. నవరాత్రి ఉత్సవాల సందర్భంగా బుధవారం ఉదయం ఎమ్మెల్యే దంపతులు బోయకొండకు రాగా ఆలయ మర్యాదల ప్రకారం మేళతాళాల నడుమ వేదపండితులు పూర్ణ కుంభ స్వాగతం పలికారు. ఆలయంలో సరస్వతీదేవి అలంకారంలో కొలువుదీరిన అమ్మవారికి పెద్దిరెడ్డి దంపతులు పట్టువస్త్రాలు సమర్పించారు. అనంతరం ప్రత్యేక పూజలు చేశారు. ప్రధాన గర్భాలయం కింద ఉన్న మూలస్థానం, రణభేరి గంగమ్మ ఆలయాల్లో కొలువుదీరిన అమ్మవార్లకు పూజలు చేశారు. వేద పండితులచే పెద్దిరెడ్డి దంపతులతో పాటు, తంబళ్లపల్లె ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి, మాజీ ఎంపీ ఎన్.రెడ్డెప్ప, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డికి ఆశీర్వాదాలు అందించారు. అనంతరం ఈఓ అమ్మవారి పవిత్ర తీర్థప్రసాదాలతోపాటు అమ్మవారి చిత్రపటాన్ని అందజేశారు.

ఐదేళ్లలో రూ.500 కోట్లతో బోయకొండను అభివృద్ధి చేశాం

పవిత్ర పుణ్యక్షేత్రమైన బోయకొండను వైఎస్సార్‌సీపీ ఐదేళ్ల పాలనలో రూ.500 కోట్లు ఖర్చుచేసి ఊహించని రీతిలో అభివృద్ధి చేశామని మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి వెల్లడించారు. ఆయన మీడియాతో మాట్లాడుతూ, గత ప్రభుత్వంలో వందల కోట్లు ఖర్చు చేసి ఇక్కడికి వచ్చే భక్తులకు సకల సదుపాయాలు కల్పించామన్నారు. ప్రస్తుత సీఎం చంద్రబాబు ఈ జిల్లావారేనని ఇంకా శ్రద్ధ తీసుకొని ఈ ఐదేళ్లలో గతంలో కంటే ఎక్కువగా బోయకొండ అభివృద్ధిపై దృష్టి పెట్టాలని కోరారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆ పార్టీ నాయకులు అనేక తప్పులు చేశారన్నారు. ఆ తప్పులన్నీ సర్దుబాటు చేసుకుని వారి బతుకుదెరువు కోసం సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో చౌడేపల్లె, సదుం జెడ్పీటీసీ సభ్యులు దామోదరరాజు, సోము శేఖర్‌రెడ్డి, వైస్ ఎంపీపీ సుధాకర్‌రెడ్డి, బోయకొండ ఆలయ కమిటీ మాజీ చైర్మన్లు మిద్దింటి శంకర్ నారాయణ, నాగరాజారెడ్డి, మాజీ ఎంపీపీలు అంజిబాబు, రుక్మిణమ్మ, రెడ్డిప్రకాష్, పుంగనూరు ఎంపీపీ అక్కిసాని భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు ఆలోచనలోనే కల్తీ


మాట్లాడుతున్న మాజీ మంత్రి ఆర్కేరోజా

నగరి : చంద్రబాబు ఆలోచనలోనే కల్తీ ఉంది తప్ప లడ్డూలో లేదని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ మంత్రి ఆర్కేరోజా అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రధానిని కలిసి లడ్డూ ప్రసాదాలు అందించే సమయంలో స్వచ్ఛమైన నేతితో చేసిన లడ్డూ అంటూ ఛమత్కరించారని పచ్చ మీడియాలో వచ్చిన వార్తలపై ఆమె ఎక్స్ వేదికగా స్పందించారు. చింత చచ్చినా పులుపు చావలేదు అన్న సామెత చంద్రబాబు కోసమే పుట్టినట్లు ఉందని ఎద్దేవా చేశారు. పవిత్రమైన తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదాలపై విచారణ, ఆధారాలు లేకుండా రాజకీయ దురుద్దేశంతో కల్తీ ఆరోపణలు చేసి కోట్లాది మంది హిందువుల మనోభావాలను తీవ్రంగా గాయపరిచారని చెప్పారు. సుప్రీం కోర్టు చంద్రబాబు వేసిన సిట్‌ను పక్కకు పెట్టేసి, సీబీఐ సారథ్యంలో నూతన సిట్ ఏర్పాటు చేయడంతో పాటు రాజకీయ విమర్శలు వద్దంటూ ఆదేశాలు జారీ చేసిందని గుర్తు చేశారు. అయినా దుర్బుద్ధితోనే చంద్రబాబు చేసిన వ్యాఖ్యలను పచ్చ మీడియా ప్రచారం చేస్తోందన్నారు. ఆయన మాట్లాడితే కోర్టు ధిక్కారణ అవుతుంది కనుక తన మీడియాతో కల్తీ కథనాలు ప్రచారం చేస్తున్నారని ఎండగట్టారు.

క్లుప్తంగా

గ్రానైట్ లారీ సీజ్



సీజ్ చేసిన లారీని చూపుతున్న ఎస్ఐ

ఐరాల: అక్రమంగా గ్రానైట్ తరలిస్తున్న లారీని సీజ్ చేసినట్లు కాణిపాకం ఎస్ఐ ధరణీధర తెలిపారు. ఆయన బుధవారం మాట్లాడుతూ మండలంలోని పుత్రమద్ది నుంచి చిత్తూరుకు తరలిస్తున్న గ్రానైట్ లారీకి ఎలాంటి రికార్డులు, ధ్రువీకరణ పత్రాలు లేవని గుర్తించినట్లు తెలిపారు. ఆ లారీని జిల్లా మైనింగ్ అధికారులకు లారీని అప్పగించినట్లు వివరించారు. కాణిపాకం పోలీస్ స్టేషన్ పరిధిలో ఎవరైనా అక్రమ మైనింగ్ పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

అదృశ్యమైన బాలుడు క్షేమం

పుంగనూరు: పట్టణంలోని రహమత్‌నగర్‌లో నివాసం ఉన్న వశీం, నస్రీన్‌తాజ్ దంపతుల కుమారుడు జుబేర్ (16) ఈ నెల 3వ తేదీ అదృశ్యమయ్యారు. అయితే హఠాత్తుగా మంగళవారం తిరిగి ఇల్లు చేరుకున్నాడు. పట్టణంలో అశ్వియ అంజుమ్ హత్య కావడం, ఆ హత్య కేసులో ఇతనికి తెలిసిన వారు ఉన్నారన్న అనుమానంతో పోలీసులు విచారించారు. దీంతో భయపడిన జుబేర్ చెప్పకుండా ఇంటి నుంచి వెళ్లిపోయి, మళ్లీ రావడంతో సమస్య పరిష్కారమైంది.

108 ఆలస్యం.. స్థానికుల వాగ్వాదం



గాయపడ్డ అహ్మద్‌బాషా

పలమనేరు: మండలంలోని 4 కిలోమీటర్ల దూరంలో ఉన్న 108 వాహనం గంట తరువాత ప్రమాదస్థలికి చేరుకోవడంతో స్థానికులు వాగ్వాదానికి దిగారు. సాకేపూరు వద్ద పలమనేరు-కుప్పం రహదారిపై కుక్క అడ్డురావడంతో బైక్‌పై వెళుతున్న బైరెడ్డిపల్లి మండలం ఖాజీపేటకు చెందిన వృద్ధుడు అహ్మద్‌బాషా(65) బుధవారం గాయపడ్డాడు. దీన్ని గమనించిన స్థానికులు వెంటనే 108కు సమాచారం ఇచ్చారు. నాలుగు కిలోమీటర్ల దూరంలో ఉన్న బైరెడ్డిపల్లి నుంచి 108 గంటసేపైనా రాకపోవడంతో ఆ వృద్ధుడు విలవిల్లాడిపోయాడు. ఆలస్యంగా వచ్చిన 108 సిబ్బందితో స్థానికులు వాగ్వాదానికి దిగారు. ఆ తరువాత అదే వాహనంలో బైరెడ్డిపల్లి ఆస్పత్రికి తరలించారు. ఇటీవల కాలంలో తరచూ 108 వాహనాలు సకాలంలో చేరుకోవడం లేదన్న విమర్శలు వస్తున్నాయి.

చెరుకు కనుమరుగు



చెరుకు పంట

జిల్లాలో చెరుకు సాగు సంక్షోభంలో ఉంది. ఆరుగాలం శ్రమించి చెరుకు పండించి అందరికీ తీపి అందించిన రైతుకు మాత్రం చేదే మిగిలింది. పండించిన పంటను ఫ్యాక్టరీలకు తోలితే ఫ్యాక్టరీ యాజమాన్యం వారికి డబ్బులు చెల్లించకుండా ఫ్యాక్టరీని లాకవుట్ చేసి పలాయనం చిత్తగించింది. దీంతో చెరుకు బకాయిలు పేరుకుపోవడంతో రైతులు తీవ్ర మానసిక సంక్షోభానికి గురయ్యారు. ఫ్యాక్టరీలో పనిచేసిన ఉద్యోగులు వీధినపడటంతో పాటు ఫ్యాక్టరీ నుంచి రావలసిన వేతన బకాయిలు, పీఎఫ్, గ్రాట్యుటీలు రాక ఫ్యాక్టరీల చుట్టూ సమ్మెల పేరిట ప్రదక్షిణలు చేశారు. దీంతోపాటు యాజమాన్యంపై కేసులు పెట్టినా ఇప్పటి వరకు ఫలితం శూన్యం. మరోవైపు చక్కెర ఫ్యాక్టరీలు ఒక్కొక్కటే మూతబడుతూ రావడం ఉన్న ఒక్క ఫ్యాక్టరీకే చెరుకు తరలించాల్సి వచ్చింది. దీంతో మెల మెల్లగా రైతులు చెరుకు సాగుపై మక్కువ తగ్గించుకున్నారు. దీంతో జిల్లాలో చెరుకు సాగు గణనీయంగా తగ్గిపోయి కనుమరుగవుతోంది.

- చక్కెర ఫ్యాక్టరీలకు తాళం
- బకాయిలు చెల్లించని యాజమాన్యం
- రైతుకు నష్టాల భారం
- జిల్లాలో గణనీయంగా తగ్గిన విస్తీర్ణం

నింద్ర : జిల్లాలోని రైతుకు ఒకప్పుడు లాభసాటిగా ఉన్న చెరుకు పంట, వరుసగా ఫ్యాక్టరీలు మూతబడడంతో సంక్షోభంలో పడింది. జిల్లాలో గతంలో ఆరు చక్కెర ఫ్యాక్టరీలు ఉండేవి. దీంతో రెండు దశాబ్దాల కాలం పాటు రైతులు చెరుకు సాగులో మంచి లాభాలు గడించారు. సాగు విస్తీర్ణం కూడా జిల్లాలో ఎక్కువగా ఉండేది. చిత్తూరు, గాజుల మండ్యంలలోని కో-ఆపరేటివ్ సుగర్ ఫ్యాక్టరీలు, పుంగనూరు, నింద్ర, శ్రీకాళహస్తిలోని ప్రైవేటు సుగర్ ఫ్యాక్టరీలు మూతబడ్డాయి. నేడు నెలవాయి వద్ద ఉన్న ఎస్ అండ్ జె షుగర్ ఫ్యాక్టరీ మాత్రమే నిర్వహణలో ఉంది. దీంతో జిల్లాలోని చెరుకు రైతులందరికీ ఆ ఫ్యాక్టరే గత్యంతరంగా మారింది. ఫ్యాక్టరీలో టన్నుకు రూ.3,150 ఇస్తున్నప్పటికీ, చెరుకు సరఫరా పెరగడంతో పర్మిట్లు ఇవ్వడంలో ఆలస్యం చోటుచేసుకుంటోంది. పక్క రాష్ట్రం తమిళనాడులోని తిరువళాంగాడు, కాంచీపురం తరలిద్దామనుకుంటే రెండు రోజులు సమయం పట్టడంతో చెరుకు ఎండి బరువు తగ్గడంతో పాటు, రవాణా ఖర్చు ఎక్కువవుతోంది. అక్కడ ఫ్యాక్టరీలో టన్నుకు రూ.3,800 ఇస్తున్నా రవాణ ఖర్చులు ఎక్కువైనందున అది గిట్టుబాటుకాదు. మద్దతు ధర విషయంలో అక్కడ డిమాండ్ చేసే పరిస్థితి ఉండదు. చెరుకు ఎండిపోతుంటే గత్యంతరం లేక కొందరు రైతులు దళారుల ద్వారా చెరుకు పంటను తమిళనాడుకు తరలిస్తున్నారు. ఫ్యాక్టరీ ఇచ్చే డబ్బులకు, పంట సాగు ఖర్చుకు బేరీజు వేసుకొని ఏమాత్రం లాభం లేకపోవడంతో పంటసాగును విరమించుకుంటున్నారు. రైతు ఎకరం పొలంలో చెరుకును పండించాలంటే రూ.45 వేల వరకు ఖర్చు చేయాల్సి ఉంటుంది. చెరుకును కొట్టే కూలీలకు కూడా రైతులే చెల్లిస్తున్నారు. ఎకరానికి 30 టన్నులకు మించి దిగుబడి రాదు. తోలిన చెరుకు డబ్బుల కోసం రైతులు ఫ్యాక్టరీల చుట్టూ తిరగాల్సి ఉంటుంది. దీనికితోడు ఎలాంటి ప్రోత్సాహకాలు లేకపోవడంతో రైతులు చెరుకు విస్తీర్ణాన్ని తగ్గిస్తూ వస్తున్నారు. క్రమంగా చెరుకు తినాలన్నా పక్క రాష్ట్రం నుంచి కొనుక్కోవలసిన దుస్థితి వస్తుంది.

కోట్లలో బకాయిలు

మూతబడిన ఫ్యాక్టరీల కారణంగా చెరుకు బకాయిలు రాక రైతులు తీవ్ర ఆవేదనకు లోనయ్యారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సహకార చక్కెర ఫ్యాక్టరీల్లో రైతులకు ఉన్న బకాయిలను, ఉద్యోగలకు చెల్లించాల్సిన వేతన బకాయిలను చెల్లించేసింది. ప్రైవేటు ఫ్యాక్టరీలకు చెరుకు తోలిన రైతులకు, ఉద్యోగులకు బకాయిలు అందలేదు. ఒక్క నింద్ర నేటమ్స్ షుగర్ పరిధిలోనే 3,210 మంది రైతులకు ఫ్యాక్టరీ నుంచి రావలసిన చెరుకు బకాయిలు రూ.35.70 కోట్లు. కార్మికులు 310 మంది ఉండగా వారికి రూ. 5.60 కోట్లు వేతన బకాయిలు ఉన్నాయి. ఇలా ప్రైవేటు ఫ్యాక్టరీల నుంచి రైతులకు రావలసిన బకాయిలు వంద కోట్లకు పైగా ఉంది. దీనిపై చెరుకురైతు సంఘాలు, కార్మిక యూనియన్‌ల నేతృత్వంలో జరుగుతున్న ఆందోళనలు అన్నీ ఇన్నీ కావు. రైతులు, ఫ్యాక్టరీ కార్మికులు విడివిడిగా యాజమాన్యాలపై కేసులు వేసినా ఫలితం లేదు. తాము అధికారంలోకి వచ్చిన వెంటనే చెరుకు రైతులకు రావలసిన బకాయిలు చెల్లించి ఫ్యాక్టరీ ప్రారంభిస్తామన్న అధికార పార్టీ నేతలు అధికారంలోకి వచ్చి వందరోజులు దాటినా ఫ్యాక్టరీ అంశంపై అణువంతైనా స్పందించలేదు. దీంతో చెరుకు సాగు ప్రశ్నార్థకంగా మారింది.

జిల్లాలో గతంలో ఉన్న చెరుకు సాగు	20 వేల హెక్టార్లు
జిల్లాలో ప్రస్తుత చెరుకు సాగు	8500 హెక్టార్లు
గతంలో ఉన్న ఫ్యాక్టరీలు	6
ప్రస్తుతం ఉన్న ఫ్యాక్టరీలు	1
గతంలో చెరుకు క్రషింగ్ సామర్థ్యం	20 వేల టన్నులు
ప్రస్తుతం చెరుకు క్రషింగ్ సామర్థం	4 వేల టన్నులు

పాతబకాయిలు చెల్లించాలి



నేను పండించిన చెరుకు నింద్ర నేటమ్స్ షుగర్ ఫ్యాక్టరీకే తరలించా. దానికి వారు చెల్లించాల్సిన డబ్బులు ఏడేళ్లుగా రాలేదు. రూ.1.80 లక్షలు బకాయిలు రావాలి. బకాయిలు వస్తుందని ఎదురుచూసి చూసి అలసిపోతున్నా. నాలా చాలా మంది రైతులు మధనపడుతున్నారు. చెరుకు సాగు జోలికి వెళ్లాలంటే రైతులు భయపడే పరిస్థితి వచ్చింది. వారు సాగు చేయాలంటే ప్రభుత్వమే బాధ్యత తీసుకోవాలి.

– రవినాయుడు, చెరుకురైతు, సదాశివపురం గ్రామం

మా బకాయిల పరిస్థితి ఏంటి?



నేను నింద్ర షుగర్ ఫ్యాక్టరీలో 15 సంవత్సరాలు కార్మికునిగా పనిచేశా. ఏడేళ్ల క్రితం అకస్మాత్తుగా ఫ్యాక్టరీ రోడ్డున పడేసి వెళ్లిపోయింది. ఇక్కడ ఉన్న అనుభవంతో మరో ఫ్యాక్టరీలో చేరదామంటే చెరుకు ఫ్యాక్టరీ జిల్లాకు ఒక్కటి మాత్రమే ఉంది. నాకు చివరి ఏడాది రావలసిన జీతం, పీఎఫ్ చేరి రూ.4 లక్షలు బకాయిలు ఉన్నాయి. కోర్టులో కేసు వేసినా ఫలితం లేదు. మా సమస్యను ప్రభుత్వం పరిష్కరించాలి.

– భాస్కర్, షుగర్ ఫ్యాక్టరీ కార్మికుడు, నింద్ర

ఒక్క అడుగూ పడలేదు



చెరుకు ఫ్యాక్టరీ తెరిపిస్తాం, చెరుకు రైతులకు బకాయిలు ఇప్పిస్తామన్న కూటమి ప్రభుత్వ నేతలు ఎన్నికల్లో గెలిచాక హామీలు మూటకట్టి పడేశారు. పాలన వంద రోజులు దాటినా ఈ విషయంలో ఒక్క అడుగూ ముందుకు పడలేదు. నాకు రూ.2 లక్షల వరకు బకాయిలు రావాలి. ఇలా ఫ్యాక్టరీ నుంచి రైతులకు రూ.36 కోట్లు బకాయిలు రావాలి. అందుకే రైతులు చెరుకు సాగును వదిలేస్తున్నారు.

– మునికృష్ణారెడ్డి, చెరుకు రైతు, అత్తూరు

టీడీపీ దాడి బాధితులకు పరిహారం



బాధితులకు పరిహారం అందజేసిన విజయానందరెడ్డి

చిత్తూరు కార్పొరేషన్: అధికారంలో రాగానే కూటమి నాయకులు వైఎస్సార్‌సీపీ శ్రేణులపై కక్ష కట్టి దాడులు చేశారు. ఇందులో పలువురు గాయపడగా, మరి కొందరి ఆస్తులు దెబ్బతిన్నాయి. వారికి అండగా పార్టీ ఆర్థికసాయం అందించింది. ఆ మొత్తాన్ని చిత్తూరులోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో బుధవారం నియోజకవర్గ ఇన్‌చార్జి విజయానందరెడ్డి అందజేశారు. తక్కువ కాలంలో కూటమి ప్రభుత్వం ప్రజల్లో వ్యతిరేకత తెచ్చుకుందన్నారు. పార్టీకి అండగా ఉన్న నాయకులు, కార్యకర్తలను కాపాడుకుంటామన్నారు. మరింత పటిష్టం చేయడానికి అనుబంధ విభాగాలను నూతన కమిటీలను ఏర్పాటు చేయాలని అధిష్టానం ఆదేశించిందన్నారు. చిత్తూరు నియోజకవర్గం, ఎస్‌ఆర్ పురానికి చెందిన 12 మందికి నాయకులు, కార్యకర్తలకు మొత్తం రూ.7.5 లక్షలు అందజేశారు. సురేష్ బాబు, ఆను, పురుషోత్తంరెడ్డి, ఖాదర్, భాస్కర్‌రెడ్డి, మురుగన్, సుబ్రమణ్యం, ప్రసాద్, గురుమూర్తి, జాకీర్‌హుస్సేన్, రాజు, సుధాకర్‌నాయుడుకు సాయం అందజేశారు. కార్యక్రమంలో రూరల్ మండల అధ్యక్షుడు త్యాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఎస్టీయూ నేత గంటామోహన్ సస్పెన్షన్

చిత్తూరు కలెక్టరేట్ : ఎస్టీయూ రాష్ట్ర నాయకుడు, బంగారుపాళ్యం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సైన్సు ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న గంటామోహన్‌ను సస్పెండ్ చేశారు. ఈ మేరకు బుధవారం డీఈఓ దేవరాజు వివరాలు వెల్లడించారు. నిబంధనలను అతిక్రమించి డీఈఓ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించడం వల్ల గంటామోహన్‌ను సస్పెండ్ చేసినట్లు తెలిపారు. సస్పెన్షన్‌కు ముందు షోకాజ్ నోటీసు జారీచేసినట్లు తెలిపారు. అయితే ఆ నోటీసుకు ఆయన సంతృప్తికరమైన సమాధానం ఇవ్వలేదని వివరించారు. ముందస్తు అనుమతి తీసుకోకుండా విద్యాశాఖ కార్యాలయం ఎదుట ధర్నా చేసి డీఈఓను దూషిస్తూ మీడియాతో మాట్లాడినట్లు ఆయన తెలిపారు. ఉపాధ్యాయ సమస్యలపై గట్టిగా నిలదీసినందుకు గాను అక్కసుతో ఆ సంఘం నాయకుడిని సస్పెండ్ చేసినట్లు టీచర్లు చర్చించుకుంటున్నారు.

ఫ్రీ హోల్డ్ భూములపై నివేదికలు ఇవ్వండి

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలో ఫ్రీ హోల్డ్ భూముల సమగ్ర సమాచారం త్వరితగతిన అందించాలని జాయింట్ కలెక్టర్ విద్యాధరి ఆదేశించారు. ఆమె బుధవారం కలెక్టరేట్‌లో ఆర్‌డీఓ, తహసీల్దార్లతో సమావేశం నిర్వహించారు. జేసీ మాట్లాడుతూ జిల్లాలో ఫ్రీ హోల్డ్ భూములకు సంబంధించిన సమగ్ర నివేదికలను ఈ నెల 10వ తేదీ నాటికి కలెక్టరేట్ కి పంపాలన్నారు. వివరాలను సమగ్రంగా పరిశీలించి నివేదికలు సిద్ధం చేయాలన్నారు. నివేదికల విషయంలో అలసత్వం ప్రదర్శిస్తే చర్యలు కఠినంగా ఉంటాయన్నారు. సీసీఎల్ఏ నుంచి అందిన నమూనా మేరకు వివరాలను అందించాలని ఆదేశించారు. ప్రతి మండలం వారీగా ఫ్రీ హోల్డ్‌లో ఉన్న భూముల్లో సర్వే నెంబర్లు, అనుభవంలో ఉన్న వారి వివరాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి నివేదికలు సిద్ధం చేయాలన్నారు. ఈ సమావేశంలో డీఆర్ఓ పుల్లయ్య, ఆర్‌డీఓలు శ్రీనివాసరాజు, వెంకట్‌రెడ్డి, శ్రీనివాసులు పాల్గొన్నారు.

జీడీ నెల్లూరులో ఏపీఎంల కుర్చీలాట



ఫరీద్ మస్తాన్



ఏపీఎం సీటులో కూర్చున్న చిరంజీవి

గంగాధర నెల్లూరు : మండల మహిళా సమాఖ్య ఏపీఎంగా ఫరీద్ మస్తాన్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఆ తరువాత కొద్దిసేపటికే ఇక్కడి నుంచి రిలీవ్ ఆర్డర్ తీసుకుని, పోస్టింగ్ ఎక్కడా పొందని ఏపీఎం చిరంజీవి ఆ సీటులో కూర్చోవడంతో గందరగోళంలో పడ్డారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు కార్యాలయంలోనే కూర్చుని తరువాత వెళ్లిపోయారు. గంగాధరనెల్లూరుకు కొత్త ఏపీఎం రావడంతో పాత ఏపీఎంకు పోస్టింగ్ ఎక్కడా ఇవ్వలేదు.

వెలుగుపై కూటమి విషం

- అడ్డగోలుగా సిబ్బంది తొలగింపు
- టీడీపీ నేతల గుప్పిట్లో అధికారులు
- అధికారుల తీరుపై మండిపడుతున్న గ్రూపు సభ్యులు



గంగవరం వెలుగు కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న గ్రూపు సభ్యులు

పలమనేరు: కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే వెలుగుపై పచ్చ విషం కక్కుతోంది. అధికార పార్టీ నేతలు ఆడించినట్టు వెలుగు అధికారులు కీలుబొమ్మలుగా మారారు. వారి ఆదేశాల మేరకు ఎవరిని తీసేయాలంటే వారిని తీసేయడం, కావాల్సిన వారిని నియమించుకోవడం పలమనేరు నియోజకవర్గంలో ఇప్పుడు సాగుతున్న తంతు. సాధారణంగా వెలుగు గ్రూపులకు సంబంధించి సంఘమిత్రలను, లేదా లీడర్లను తొలగించడం, కొత్తవారిని పెట్టుకోవడం అధికారుల పనికాదు. ఇది కేవలం గ్రామ సమాఖ్య, లేదా మండల స్థాయిలో, మండల సమాఖ్య ద్వారా గ్రూపు మహిళలు చేయాల్సిన పని. కానీ నిబంధనలకు పాతరేసిన వెలుగు సీసీలు, ఏపీఎంలు కూటమి నేతల మాటలు విని వెలుగులో కీలకంగా పనిచేసే సంఘమిత్రలను నిష్కారణంగా తొలగిస్తున్నారు. దీనిపై తీవ్రంగా మండిపడిన గ్రూపు మహిళలు నిసనలు, ధర్నాలకు సైతం దిగుతున్నారు. వెలుగు అధికారుల తీరును ఎండగడుతున్నారు.

ఇదిగో సాక్ష్యం.

గంగవరం మండలం బండమీద జరావారిపల్లెకు చెందిన గ్రూపులకు శ్రీనివాసులు సంఘమిత్రగా గత కొన్నేళ్లుగా పనిచేస్తూ సంఘాల అభివృద్ధికి కృషిచేశాడు. అయితే అధికార పార్టీ బడానేతల సిఫార్సుల మేరకు ఆ మండల ఏపీఎం హరినాథ్ ఇక్కడి సంఘమిత్రను ఇటీవల విధుల నుంచి తొలగించారు. కూటమి అభ్యర్థులు సూచించిన హేమను ఎంపిక చేశారు. దీనిపై మండిపడిన ఆయా సంఘాల మహిళలు వందలాది మంది రెండ్రోజుల క్రితం వెలుగు కార్యాలయం వద్ద నిరసనలకు దిగారు. ఆపై సీసీ గంగాధర్, ఏపీఎం హరినాథ్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ వారిపై వాగ్వాదానికి దిగారు. టీడీపీ నేతల మాటలు వింటున్న ఈ అధికారులను విధుల నుంచి తొలగించాలంటూ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. అంతటితో ఆగకుండా గంగవరం పోలీసులకు సైతం ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులకు ఎలాంటి చర్యలు తీసుకోవాలో పాలుపోలేదు. దీనిపై డీఆర్‌డీఏ పీడీ విచారణ చేపాట్టాలని గట్టిగా డిమాండ్ చేశారు.

నియోజకవర్గంలో సగంమంది ఔట్

నియోజకవర్గంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాలుగునెలల్లో వెలుగులో పనిచేసే సగం మంది సంఘమిత్రలను అధికారులు తొలగించారు. వీరిలో గ్రూపు సభ్యుల బలమున్న సంఘమిత్రలకు మాత్రం సభ్యులు అండగా నిలబడి నిరసన కార్యక్రమాలకు దిగారు. మిగిలిన వారు తాము ఇంత కష్టపడినా విధులనుంచి తొలగించారనే బాధతో ఇంటికే పరిమితమయ్యారు. ఏదేమైనా కూటమి నేతల మాటలకు తలొగ్గి సంఘమిత్రలను తొలగించడంపై నియోజకవర్గంలో సర్వత్రా విమర్శలు తప్పడం లేదు. కూటమి నేతలకు సరెండర్ అయిన వెలుగు అధికారులను విధులనుంచి తప్పించాలనే డిమాండ్ గ్రూపు మహిళలనుంచి గట్టిగా వినిపిస్తోంది. కనీసం డీఆర్‌డీఏ పీడీ అయినా వీరిపై చర్యలు తీసుకునే సాహసం చేస్తారా లేదా కూటమి నేతలకు దాసోహం అవుతారా అనే అనుమానం వ్యక్తమవుతోంది.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండండి



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి

చిత్తూరు రూరల్(కాణిపాకం): సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా వ్యవహరించాలని జిల్లా మలేరియా అధికారి అనిల్‌కుమార్ అన్నారు. చిత్తూరు నగరంలోని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో బుధవారం ఆయన సబ్ యూనిట్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. కురుస్తున్న వర్షాలకు జిల్లాలో విషజ్వరాలు ప్రబలుతున్నాయని తెలిపారు. డెంగీ కేసులు నిర్ధారణ అయితే తక్షణమే స్పందించాలన్నారు. కేసులు నమోదైన ప్రాంతంలో పారిశుద్ధ్య కార్మికులు చర్యలు చేపట్టాలన్నారు. జ్వరం కేసులకు విధిగా వైద్య పరీక్షలు చేయాలని ఆయన ఆదేశించారు.